


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**112**

**(13 ' జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కాంగ్రెస్ మహా** సభలు రెండూ చాలా పట్టుదలతో పంతంతో జరిగాయి. రెండేళ్ళ తర్వాత రానున్న ఎన్నికల మానిఫెస్టోలుగా తయారయ్యాయి ఉపన్యాసాలు భారతదేశాన్ని పసిడి సీమ చేస్తామనీ, పవిత్రసీమ చేస్తామనీ ప్రతిజ్ఞలు. పూనాకు రాని కార్యక్రమాలకు సంబంధించిన ప్రకటనలు చేశారు.

వీరి సభలు వట్టి బూటకం అని ఒకరంటే వారి సభలు వట్టి నాటకం అని రెండోవారన్నారు. మెజారిటీ కాంగ్రెస్ మాదని ఒకరంటే సజావైన కాంగ్రెసు మాదని రెండోవారన్నారు. మీరు ఫలానా వారి మద్దతు కోరుతున్నారని ఒక పక్షంవారు ఆరోపణ చేస్తే మీరు మాత్రం ఊరు కున్నారా? ఫలానా వారితో పొత్తుకోసం ప్రయత్నించడం లేదా అని రెండోవారు ప్రశ్నించారు.

ఎంత చూసినా తప్పు ఒప్పుకునే వారెక్కడా కనిపించడంలేదు. తప్పులన్ని ఎదుటివారివి గొప్పతనమంతా మాది" అని మురిసిపోవడంతోనే సరిపోతుంది కాలం. ఏం కాలం? కాలానికే సిగ్గువేసి గడ్డకట్టుకుపోతోంది. ఎవరి విషయం ఆలోచించినా దొడ్డతనం మృగ్యమై దొడ్డిత్రోవ నడకలే కనిపిస్తున్నాయి. 'సబ్జెక్టు' లేని 'ప్రిడికెటీ'లలోలాగా ఈ సిండికేట్, ఇండికేట్‌లంటూ వెలిసినాయి. వీటిని ఏకం చేసేదెవరు? ప్రజానీకానికి మనశ్శాంతి కల్పించేదెవరు.

ఈ ఉభయ సమావేశాల పుణ్యమా అని బొంబాయి, అహ్మదాబాద్, యాత్రలు చేసే అవకాశం చాలామందికి లభించింది. కాంగ్రెస్ గోత్రీకులందరికి పిలుపులు వచ్చాయి. "తమరు సభలకు తప్పక దయచెయ్యాలి. సభల్ని జయప్రదం చెయ్యాలి. మీ సమక్షం అక్కడ స్వర్గంగా భావించబడుతుంది ఆశయాలన్నీ పోషించబడతాయి. మీ ఖర్చులన్నీ భరించపడతాయి" అని స్తోత్రం చేసి చాలామందిని తీసుకుపోవడం జరిగిందట.

ఒక కాంగ్రెస్ సభ్యుడు బొంబాయిలో నర్గీస్ ఉంది. ఆవిడ ఇంటికి తీసుకు వెడతానంటే తప్పకవస్తా. లేకపోతే అహమ్మదాబాద్ పోతా" అన్నాడట.

ఒకాయన మా అబ్బాయికి వచ్చే సంవత్సరం మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తానంటే బొంబాయి వస్తానన్నాడట. ఇలా యీ సమావేశాలలో వివిధ రాష్ట్రాలకు సంబంధించిన కాంగ్రెసు వాదుల కోరికలు తీరినాయని చెప్పుకున్నారు మన రాజధాని నగరంలో.

ఒకాయన రెండు కాంగ్రెస్ సంస్థలు ఇద్దరు కాంగ్రెస్ అధ్యక్షులు, నలుగురు కార్యదర్శులు అన్న విషయాన్ని గురించి చర్చిస్తూ "ఇది నిజానికి చాలా తమాషాగా ఉంది. మన నాటకాలలో ఇద్దరు ముగ్గురు కృష్ణుల్ని చూడటం అలవాటు చేసుకున్నాం. అలాగ యిద్దరు అధ్యక్షులను కూడా చూస్తున్నాం.

అయితే నాటకంలో కృష్ణులు ఒకరి పోర్షన్ తరువాత రెండోవారి పోర్షన్ చెపుతారు. అంతగా అవసరమైతే వారికి వచ్చిన ప్రత్యేక విద్య ఏదో ఒకటి ప్రదర్శించి చక్కాపోతారు. ఇక్కడ అలా కాదు. ఒకే పోర్షన్ ఇద్దరూ వేరు వేరు విధాలుగా చెపుతున్నారు.

పైగా ఒకరి పాత్ర నొకరు ఖండిస్తున్నారు. అక్కడితో మనకి తెలిసిన సీనులుపోయి, క్రొత్త సీనులు బయలుదేరుతున్నాయి. చివరికిది కురుక్షేత్ర నాటక పక్కీలోకి వచ్చేలాగా ఉంది సుమా'' అని విస్తుపోయారు.

''వీరు ఒకరకం ఇజాన్ని, నాలో మరోరకం ఇజాన్నీ ప్రచారం చేస్తున్నారు. మొత్తం మీద మూల సిద్ధాంతం ఒకటేనంటున్నారు. పైకి ప్రజానీకానికి కనిపించేది మాత్రం ఇద్దరి మధ్య ''యాంటాగనిజం'' (వైరభావం) అని ఒకాయన వివరించారు.

కొందరు ఇందిరాదేవి భక్తులు ఏది ఏమైనా తాం ఆమెనే బలపరుస్తామని వాగ్దానాలు చేయడమే కాకుండా, ఆమెనే దేవతగా కొలవడం ప్రారంభించారు. కొందరు భక్తులు తమ ఆడ సంతానానికి 'ఇందిరా ప్రియం వద' అనే నామకరణాలు కూడా చేశారట. ''ఇండియా అంటే ఇందిరే, 'ఇందిర అంటే ఇండియా' అనే విశ్వాసం చాలామందిలో ప్రబలింది.

ఇదివరలో ఇతర దేశాలవారు ''గాంధీజీ ఇండియా'' అని ''నెహ్రూజీ ఇండియా'' అని చెప్పుకునేవారు. ఇప్పుడు మనదేశంలో వారే ''ఇందిర ఇండియా'' అని సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఈ రోజుల్లో కూడా వెనుకటి మహనీయుల పేర్లతోనే పిలవడం మాని వేయడం కూడా మంచిదే

ఆ వర్గానికి చెందినవారు చాలామంది ఒకరినొకరు కలుసుకున్నప్పుడు ''రామ్, రామ్'' వగైరాలు మానివేసి ''ఇందిర జై'' అనడం ప్రారంభించారట. నిజానికి మన ప్రధాని అంతటి పలుకుబడి, సంపాదించిందీనాడు. అసలామె ప్రధాని అనేమాట మాటున పడిపోయి ''కాంగ్రెస్ రక్షకురాలు'' ''దేశరక్షకురాలు'' అభ్యుదయమూర్తి'' ''అవతారమూర్తి'' అనే భావనలతోనే పూజింపబడుతోంది. వ్యక్తిగతపూజకాదనుకోండి. ప్రజాభిమానమే అనుకోండి. అందునా ఆ పేరూ ప్రతిష్ఠా సంపాదించడం సామాన్యమా?

అయితే ఇండికేటు నాయకులలో కూడా అధిక ప్రభావం, ప్రాబల్యం గలవారు కొందరు లేకపోలేదు. వారిలో కామరాజు నాడార్ చెప్పుకో తగ్గవారు. ఆయనకు చాలామంది భక్తులున్నారు. వారంతా అహమ్మదాబాద్ కాంగ్రెస్‌కు వచ్చిన 'కామరాజు' బొమ్మలుగల చేతి ఉంగరాలు ధరించి వచ్చినట్లొక వార్త వెలువడింది.

ఇలా ఇరుపక్షాలకూ చెందిన భక్తులు వక్షస్థలాలు చీల్చి చూపడం సాధ్యంకాక తమ ఆరాధ్య దైవాల నమూనాలను ధరించి తమ భక్తి ప్రతిపత్తులను వెల్లడించుకోవడం జరిగిందట.

''పదిమంది తగ్గితే కాంగ్రెస్ ప్రతిభ తగ్గుతుందా?'' అని ఒకరంటుంటే ''ఒక వ్రేలు పోయినంత మాత్రాన చెయ్యిపోతుందా?'' అని మరోపక్షం వారంటున్నారు. ప్రజలు తప్పనిసరిగా ఇరువురి మాట వింటున్నారు. భవిష్యత్తును గురించి అంతు చిక్కని వెర్రి కలలు కంటున్నారు.

''సిండికేట్ ప్రథమ అధ్యక్షుడు మరెవరోకాదు. జవహర్‌లాల్ నెహ్రూ ఆ సంస్థలో ఉన్నందుకు గర్విస్తున్నాను'' అన్నారు సంజీవరెడ్డిగారు. దీంట్లో సత్యం లేకపోలేదేమో కానీ ప్రజలు గుర్తింపు సిండికేటు భక్తులుగా చేరాలిగదా తండోపతండాలుగా వచ్చి.

అందుకనే ఒకరన్నారు ''సంఖ్యాబలం కాదు మనం చూడవలసింది. అది కావాలంటే పెరుగుతుంది. వద్దంటే తరుగుతుంది'' అని కావాలనక ఎవరన్నా వద్దంటారా అందులో రాజకీయాలలో ప్రతినోటు ఒక పరంగా భావిస్తే గాని ప్రభుత్వంలో చోటు ఉండదని

తెలుసుగా. నోట్ల లోటు లేకుండా చేసుకోవడం కోసమే అందరి ప్రయత్నాలు. అందరూ రాజకీయ వేత్తలే. ఇందులో ధర్మ ప్రభువులెవరు. ''రాజకీయవేత్తకూ, పరిపాలకులకూ భేదం ఉంది. రాజకీయ వేత్త వచ్చే ఎన్నికల్ని గురించి ఆలోచిస్తాడు. పరిపాలకుడు వచ్చే తరాన్ని గురించి ఆలోచిస్తాడు'' అన్నాడు జేమ్స్ ఫ్రీమన్ క్లార్క్.

Post your comments